ఆఖరి క్షణం!

టెంపోరావ్

తులసి తనభర్త ప్రొఫెసర్ రాజారావువైపు చూసింది. సూటు ధరించి అతను తల దువ్వుకుంటున్నాడు. గోడ గడియారం మీదకు ఆమె చూపు వెళ్ళింది. టైమ్ పదవు తోంది!

"ఎక్కడికేనా వెళ్తున్నారా?" అందామె.

"నీతో చెప్పి వెళ్ళాలా?" అన్నాడతను ఆమెకేసి విసుగ్గా చూస్తూ.

"నేను చెప్పి వెళ్ళాలనలేదుగా!"

అతను సిగరెట్ వెలిగించి పొగపీలుస్తూ అద్దంలో తన రూపాన్ని చూసుకున్నాడు. వెనక్కి తిరిగి గుమ్మంవైపు నడిచి ఆమెముందు ఆగాడు.

"తొందరగా వచ్చేస్తారుగా?"

"చెప్పలేను. నువ్వు హాయిగా పడుకో!" అని అతను నడవమ్మట మెట్లవైపు గబగబా కదిలాడు.

ప్రొఫెసర్ రాజారావు వయస్సు నలభై వుంటుంది. పేరు ప్రఖ్యాతులున్న విల్సన్ కాలేజిలో పనిచేస్తున్నాడు. రెండువేలు పైన ప్రతి నెలా గడిస్తున్నాడు. కాని భార్యతో అతని జీవితం సుఖంగా సాగడంలేదు!

తులసి పాతకాలపు మనిషి. పూజలుచేస్తూ, దేవాలయాలకు వెళ్ళి తిరిగివస్తూ ఆమె కాలాన్ని గడిపేస్తూ వుంటుంది. ఆమె ఎక్కువగా చదువుకోలేదు. భర్తతో ఇంగ్లీషులో వుషారుగా మాట్లాడలేదు.

పదేళ్ళ క్రితం అత నామెను పెళ్ళాడవలసి వచ్చింది. ఎమ్మే పాసయిన అతనికి ఎంత వెతికినా వుద్యోగం దొరక లేదు. తులసి తండ్రి అతనికి సిఫార్సుచేసి కాలేజిలో వుద్యోగం ఇప్పించాడు. ఆ వుద్యోగంకోసం అతను ఆమె భర్త కావలసి వచ్చింది.

అతనికి నచ్చినా నచ్చకపోయినా పదేళ్ళనుంచి అతను తులసితో సంసారం సాగిస్తున్నాడు. ఆమె తండ్రి మరణించాడు. కూతుర్కి తండ్రి ఆస్తి బాగా వచ్చింది. ప్రస్తుతం ఆమెకు దగ్గరచుట్టా లెవ్వరూ లేరు.

ప్రొఫెసర్ రాజారావు ఫియట్ కారును స్పీడుగా పోనిస్తున్నాడు. చల్లటి గాలి వీస్తోంది. ఆకాశంలో చంద్రుడు అఖండంగా ప్రకాశిస్తున్నాడు.

హెడ్ లైట్ల కాంతిలో బస్టాప్ లో వున్న యువతిని అతను చూసి కారును ఆపాడు. ఆమె తలుపు తెరిచి అతనిప్రక్కనే కారులో కూర్చుంది. అతను కారును పోనిచ్చాడు.

"జయా, ఐయాం సారీ! పదినిమిషాలు లేటుగా వచ్చాను," అన్నాడతను.

ఆమె అతని దగ్గరగా జరిగింది. అతని కాలుమీద చెయ్యి వేసింది.

"వచ్చావుగా! రాజా, డోంట్ బాదర్!" అందామె.

ఇరవై ఏళ్ళ యువతి. ఎమ్మే చదువుతోంది! అతని స్టూడెంట్!

"ఎక్కడకి వెళ్దాం?" అన్నాడతను.

"బీచ్ కి వద్దు. పోలీసులు చుట్టూ తిరుగుతూవుంటారు," అంది జయ.

"నైట్ క్లబ్ కి పోదాం," అన్నాడతను.

2

పారడైజ్ నైట్ క్లబ్ లో ఎదురెదురుగా కూర్చున్నారిద్దరూ. చుట్టూ చీకటిగా వుంది. ఫ్లష్ లైట్ల కాంతిలో కాబ్రే డాన్స్ చేస్తూన్న మిస్ షమీలా అవయవాలు అందర్కీ కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. విదేశాల్లో శిక్షణపొంది తిరిగొచ్చిన మిస్ షమీలా చలాకీగా ఎగురుతోంది, గిర్రున తిరుగుతోంది, వెనక్కి వంగి తన స్తనాల సంపదను ప్రదర్శిస్తోంది. ఆర్కెస్ట్రా శ్రావ్యంగా మ్రోగుతోంది.

ప్రొఫెసర్ రాజారావు ఆమె చెయ్యి పట్టుకుని నిమిరాడు. గ్లాసులోని విస్కీ త్రాగేసి ముందుకు వంగిన ఆమె పెదిమలను ముద్దెట్టుకున్నాడు.

"రాజా, ఇలా ఎంతకాలం క్లబ్బుల్లోనూ, బీచ్ ఒడ్డునా కాలం గడుపుతాం?" అందామె.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను!" అన్నాడతను.

ఆమె అతని చేతుల్ని పట్టుకుంది.

"రాజా, నన్నెక్కడికేనా తీసుకుపో! ఒకగదిలో మనిద్దరంమాత్రం వుండాలి! నీ ఒళ్లో తలెట్టుకుని నేను పడుకోగల్గాలి," అంది జయ.

డాన్స్ పూర్తయింది. లైట్లు వెలిగాయి. నైట్ క్లబ్ లో వందమంది వున్నారు. రాజారావు నలువైపులా చూశాడు. తనకు తెలిసినవాళ్ళెవరూ లేనందుకు అతను సంతోషించాడు.

బాటిల్లోని విస్కీని అతను గ్లాసులో పోసుకుని, కొంచెం సోడా కలిపాడు. విస్కీ చప్పరిస్తూ ఆమెకేసి చూశాడు. జయ అప్సరసలా వుంది. కోలముఖం, విశాల నేత్రాలు, బంగారంలాంటి శరీరచ్ఛాయ. చెవులకు పెద్ద రింగులు వేళ్ళాడుతున్నాయి. మెళ్లో ఒకే పేట గొలుసుంది.

"జయా, బెంగుళూరు పోదాం. నాకు ఈ నెలాఖరులో సెలవులిస్తారు. వారం రోజులపాటు అక్కడ ఏ హోటల్లోనో వుండి, స్వర్గంలో విహరించి, తిరిగిరావచ్చు!" అన్నాడతను.

"తిరిగి వచ్చి నరకంలో పడాలి," అన్నదామె.

అతను నవ్వుతూ ఆమెకేసి చూశాడు. జయ కోక్ ను మెల్లిగా తాగుతోంది.

"రాజా, శాశ్వతంగా ఇలా దొంగచాటుగా మనం కల్సుకోవలసిందేనా?" అడిగిందామె.

అతను జవాబివ్వలేదు. ఆమెకేసి చూస్తూ వుండిపోయాడు. జయ! గతంలోంచి ఏవేవో అతనికి జ్ఞాపకొస్తున్నాయి.

జీవితంలో విసుగెత్తి అతనొక రాత్రి బీచ్ కి ఒంటరిగా వెళ్ళాడు. పడమకు జార్లాబడి ముందుకొస్తున్న కెరటాలను

చూస్తున్నాడు.

ఎదురుగా ఎవరో యువతి కాళ్ళు కడుక్కుంటోంది. చీర కుచ్చెళ్ళను ఎత్తిపట్టుకుంది. ఆమె పాదాలు, పిక్కలు చంద్రకాంతిలో అతడికి కనిపిస్తున్నాయి. కాస్సేపట్లో వెనక్కి తిరిగివస్తూ ఆమె అతనివైపు చూస్తూ, "ప్రొఫెసర్, మీరా!" అందామె.

"హలో జయా!" అన్నాడతను.

ఇద్దరూ గంటసేపు మాట్లాడుతూ ఇసుకలో కూర్చుండిపోయారు. చంద్రకాంతి అద్భుతంగా వుంది.

అతను టైమ్ చూశాడు. ఎనిమిదైంది.

"నువ్వు ఇంటికి వెళ్ళాలా?"

"సినిమాకు వెళ్ళి ఆలస్యంగా వస్తానని చెప్పాను," అందామె.

"అలా నైట్ క్లబ్ కి పోదాం, పద. తర్వాత మీ ఇంటి దగ్గర దిగబెడ్తాను," అన్నాడతను.

"ఫైన్, ఐయామ్ రెడీ! చీర తడిసింది. ఫరవాలేదుగా?" అడిగిందామె.

"వెట్ క్లోత్స్ యీ రోజుల్లో ఫాషన్ గా?" అన్నాడతను నవ్వుతూ.

ఆమె అతని పక్కనే ఇసుకలో నడుస్తోంది. సముద్రపు గాలి వీస్తోంది. ఆమె శరీరం అతనికి రాసుకుంటోంది. ఓరగా ఆమెను చూశాడతను. హుషారైన యువతి! ఆమె పక్క మాట్లాడుతూ నడుస్తూంటే తనకు కూడా యవ్వనం మళ్ళా వచ్చిందేమో అనిపించింది.

యువకుడిలా అతను ఏవేవో తన తీయటి కంఠంతో ధారావాహికంగా చెప్తున్నాడు. ఎంత చక్కగా మాటాడ్తాడతను అనుకొంది జయ. అతను తలుపు తెరిచి ఆమె

కూర్చోగానే మూశాడు. తన సీటులో కూర్చొని కారును పోనిచ్చాను.

మానసికంగా యవ్వనదశలో వుండగలిగిన మనిషి నూరేళ్లు నిండినా యువకుడే; ఇప్పుడు ఆ స్థితిలో వున్నాడతను.

కారును వేగంగా పోనిస్తున్నాడు.

"ప్రొఫెసర్ సార్!" అందామె.

అతనామె నడుంచుట్టూ చెయ్యిని పోనిచ్చి దగ్గరగా లాక్కున్నాడు.

"జయా, నన్ను సార్ అనకు! రాజా అని పిలు!" అన్నాడతను.

అతని చేతివేళ్ళు ఆమె పొట్టను నిమురుతున్నాయి' ఆమె విదిలించుకోలేదు. హుషారుగా, నవ్వుతూ అతనికి దగ్గరైంది!

అతను గతంలోంచి మేలుకున్నాడు.

"రాజా, నా ప్రశ్న విన్నావా?"

"విన్నాను," అని గ్లాసులోని విస్కీని అతను ఖాళీ చేశాడు.

లైట్లు ఆరిపోయాయి. మిస్ షమీలా మళ్ళీ ఫ్లడ్ లైట్లముందుకు వచ్చింది. ఆమె నాట్యం చేస్తుంటే ఆమె స్తనాలు బంతుల్లా ఎగురుతున్నాయి. అతను జయ చెయ్యి పట్టుకొని చీకట్లో ఆమె గొంతుమీద ముద్దెట్టుకున్నాడు.

"మొదట బెంగుళూరు వెళ్దాం. అక్కడి కెళ్ళాక నీ ప్రశ్నకు సమాధానం కనుక్కుందాం," అన్నాడతను.

నైట్ క్లబ్ చీకట్లో ఇద్దరూ దగ్గరయ్యారు. ఆమెను అనేకచోట్ల ముద్దెట్టుకున్నా డతను.

"రాజా, నిన్ను ఒక్క క్షణంకూడా విడిచి నేనుండ లేను," అంది జయ.

3

ప్రొఫెసర్ రాజారావు ముస్తాబై, బాగ్‌ను పరుపు మీద పడేసి యటాచ్‌డ్ బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

తులసి గదిలోకొచ్చి పరుపుమీదున్న అతని బాగ్‌ను తెరిచింది. అతని డైరీ కవర్లో వున్న యువతి ఫోటోను ఆమె చూసింది. 'విత్ లవ్, జయ' అని కింద రాసివుంది. ఎవరీ జయ ?

ఆమె డైరీని వదిలేసి అతని పర్సులోంచి రెండు రూపాయలు తీసుకుంది. రాజారావు పడగ్గదిలోకి వచ్చాడు. ఆమె కేసి ఆక్షేపణగా చూశాడు.

"ఆ బాగ్‌లో నీ వస్తువులేమీ లేవే!" అన్నాడతను.

"మీ పర్సులోంచి రెండురూపాయలు తీసుకున్నాను" అందతని భార్య.

"అడిగితే నేనే ఇచ్చేవాడినిగా!"

"రెండు రూపాయలు అడగాలని నాకు తెలియదు!"

అతను ఆమెకేసి కోపంగా చూశాడు.

"తులసీ, నీ తండ్రి నాకు ఉద్యోగం యిప్పించి వుండొచ్చు. అది మన తాతలనాటి కథ. నీదే పైచెయ్యి అన్నట్లు యీ ఇంట్లో ఇటుపైన సంచరించకు! ఎప్పుడూ ఆ బాగ్‌ను నువ్వు, అమాటకొస్తే ఎవ్వరూ ముట్టుకో కూడదు!" గద్దించాడతను.

"నన్ను క్షమించండి!" అందామె.

అతని పర్సులోంచి తీసుకొన్న రెండు రూపాయిలూ్నా పరుపు మీద పడేసి ఆమె వెళ్ళబోయింది.

"ఆ డబ్బు తీసుకో!"

"వద్దు. నా బాంక్ అకౌంట్‌లో చాలా డబ్బుంది" అందామె.

తులసి గబగబా తన గది వైపు వెళ్ళిపోయింది. అతను మెట్లు దిగి, ఇంటి ముందున్న ఫియట్ కార్లో కూర్చుని తలుపు మూశాడు.

కాలేజి వైపు కారు స్పీడుగా వెళ్తోంది. ప్రొఫెసర్ రాజారావు ఆలోచిస్తున్నాడు. తన భార్య బాగ్‌లో వున్న జయ ఫోటోను చూసి వుంటుందా? తను బాత్ రూమ్‌లో ఎక్కువసేపు వుండలేదు. భార్య అన్న మాటలు అతనికి జ్ఞాపకమొచ్చాయి. ఆమె బాంకి అకౌంటులో చాలా డబ్బు వుంది. సంవత్సరాలు దొర్లుతున్నకొద్దీ అతని ఆదాయం పెరిగింది. ఆమె ఆస్తిలోకి చెయ్యి దూర్చకుండా అతను జీవించగల్గుతున్నాడు. అందువలన ఆమె ఆస్తిని గురించి అతను మర్చిపోయాడు.

కాలేజి కాంపౌండులోకి కారు వెళ్ళింది. కారును షెడ్‌లో పెట్టి అతను స్టాఫ్ రూమ్స్ వైపు హుషారుగా అడుగు వేశాడు.

4

లత అండ్ లాల్ ఆఫీసు గదిలో లత తన కుషన్ కుర్చీలో కూర్చుని వుంది. గొంతుచుట్టూ వురితాడులా మఫ్లర్ చుట్టుకుంది. దగ్గు, రొంపలతో ఆమె బాధ పడుతోంది.

పక్క గదిలోంచి లాల్ సిగరెట్ పీలుస్తూ వచ్చి ఆమె కెదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. కళ్ళద్దాల్లోంచి శత్రువును చూసినట్లు ఒకసారి అతడిని చూసి ఆమె తన పనిలో మునిగిపోయింది.

లాల్ చిరునవ్వుతో ఆమెనే గమనిస్తున్నాడు. లత దగ్గసాగింది. రుమాల్తో ముక్కును తుడుచుకుంది.

"లతా, కాఫ్ అండ్ కోల్డుతో బాధ పడ్తున్నావు!" అన్నాడు లాల్.

"నన్ను చూసేవాళ్ళు బాధపడ్తున్నారేమో!" అంది ఆమె.

"డాక్టర్ ఫాక్స్ని కలుసుకున్నావా?"

"దీనికి డాక్టర్ అనవసరం. వేస్ట్ ఆఫ్ మనీ! రెండు మూడు రోజుల్లో అదే సరవుతుంది," అంది లత.

ఆమె మళ్ళా దగ్గసాగింది.

"మెషిన్ గన్ మోతలా వుంది నీ దగ్గు! డాక్టర్ ఫాక్స్ని అడిగి ఇది టి. బి. కి దారి తీయదని తెల్సుకోవడం మంచిది."

"షటప్, యూ డర్టీ మైండెడ్ రోగ్! నాలాంటి వాళ్ళకు టి. బి. రాదు. ఐ యామ్ హేల్ అండ్ హెల్దీ!" అర్చిందామె.

లాల్ సిగరెట్ను యాష్ట్రేలో పడేశాడు.

"లతా! హియర్ మీ! డబ్బు ఖర్చవుతుందని భయపడి డాక్టర్ ఫాక్స్ దగ్గరకు వెళ్ళడం మానుకోకు. తర్వాత ఇస్తామంటే అతను ఓ. కె. అంటాడు!" అన్నాడు లాల్.

ఆమె అతని వైపు సూటిగా చూసింది. ఏదో చెప్ప బోయి దగ్గడం మొదలెట్టింది. టేబుల్ మీదున్న రెండు కాగితాలు ఎగిరి కింద పడ్డాయి.

"గుడ్ హెవెన్స్, నువ్వు దగ్గితే కాగితాలు ఎగిరి కింద పడ్తున్నాయి. మరికొన్ని రోజులుపోతే రోగం ముదిరి నీ ఎదురుగా కూర్చున్నవాళ్ళు నువ్వు దగ్గగానే వెల్లికిలా వెనక్కి పడ్తారు." ఏడిపించాడు లాల్.

"యూ డర్టీ రాట్ లాల్! నాకు ఏ రోగం లేదని నేను చెప్తున్నాను. డాక్టర్ ఫాక్స్ సర్టిఫికెట్ నా కక్కర్లేదు. డాక్టర్ ఫాక్స్ నీలాంటి రోగే. అయిదు రూపాయిలు చేతిలో పెడితే బతికున్న మనిషికి అతను డెత్ సర్టిఫికెట్ ఇస్తాడు. రాస్కెల్స్ ఆల్!" అర్చిందామె.

బయట జోళ్ళ చప్పుడైంది. ఒక స్త్రీ గదిలో కొచ్చింది. ఆమెను కూర్చోమని తను లాల్ వైపు తిరిగింది.

"లాల్, నీ గదికి వెళ్ళు. డూ సమ్ వర్క్! ఐడిల్ గా కూర్చుంటే ఆమ్లెట్లు రావు!" అర్చిందామె.

"యూ స్టింకింగ్ బిచ్!" అని లాల్ పక్క గదిలో వున్న తన టేబుల్ దగ్గరకు వెళ్ళిపోయాడు.

చేతులు నులుపుకుంటూ లత ఆత్రంగా ఎదురుగా కూర్చున్న స్త్రీ వైపు చూసింది.

"నా పేరు తులసి. మీ సహాయం నాకు కావాలి!" అంది.

"నేషనల్ ఎమర్జన్సీ వచ్చాక మాకు తీరిక లేదు. మా రేట్లు పెరిగాయి. అయినా మీకు సహాయపడ్తాం. ఏం కావాలో చెప్పండి!" అంది లత.

"నా భర్త ప్రొఫెసర్ రాజారావు. ఆయన ఒక యువతితో తిరుగుతున్నారని నాకు అనుమానంగా వుంది. ఆమె పేరు జయ కావచ్చు. వారు ఎక్కడెక్కడ తిరుగుతున్నదీ, ఏమేమి చేస్తున్నదీ నాకు తెలపాలి!" అంది తులసి.

"ఎంత కాలంపాటు ఇది చెయ్యాలి?"

"పూర్తి వివరాలు తెలిశాక నాకు రిపోర్టు పంపండి!"

“మీరు కోరినదంతా సాధించడానికి మాకు కనీసం నెల రోజులు పడుతుంది. రోజుకు రెండు వందలు చొప్పున ఆరు వేలవుతుంది. వాళ్ళు బయట వూళ్ళకు పోతే అప్పుడు మేం కూడా వెనకనే వెళ్ళాలి. అప్పుడు రోజుకి వెయ్యి రూపాయి లిచ్చుకోవాలి. మరో విషయం. దేశంలోని బాంకులు అప్పు లివ్వడం లేదు. మనీ మార్కెట్ మహా టైట్‌గా వుంది. అందువలన ఆరు వేలు మీరు మాకు అడ్వాన్స్‌గా ఇవ్వాలి!” అంది లత.

తులసి హేండ్ బేగ్ తెరిచింది. అరవై వంద రూపాయిల నోట్లను తీసి ఆమె టేబుల్ మీద పడేసింది. మాంసం ముక్క ముందుకు కుక్క దూకినట్లు లత చేతులు నోట్లను లాగి, లెక్కెట్టి, హాండ్‌బాగ్‌లో దాచేశాయి.

“ఇది రహస్యంగా జరగాలి. నా భర్తకు తెలియకూడదు” అంది తులసి.

“డోంట్ వర్రీ, నా భర్తకు కూడా చెప్పను” అంది లత. మాట వరసకి అలా అన్నా తనకు పెళ్ళి కాలేదని లత తర్వాత లోలోన నవ్వుకుంది. తులసి కాగితం మీద అడ్రెస్ రాసి ఆమె కిచ్చింది. కుర్చీలోంచి లేచింది.

“యూ కెన్ గో మేం పని ప్రారంభిస్తాం” అంది లత.

తులసి బయటకు కదిలింది. లత బెల్ నొక్కింది. తులసింగం బయట వరండాలోంచి పరుగెత్తుకొచ్చాడు.

“లాల్‌ని రమ్మను!” అర్చిందామె.

ఆమె కంఠం విని లాల్ గబగబా గదిలోకొచ్చి కుర్చీని దూరంగా యీడ్చుకొని కూర్చున్నాడు.

“లాల్, కుర్చీనంత దూరంగా లాగి కూర్చున్నావు, ఏమిటి కారణం? ఆర్ యు ఎ టి. బి. పేషెంట్?”

అడిగిందామె.

"నేను పేషెంట్ కాకపోయినా గదిలో రోగి వున్నప్పుడు జాగ్రత్తపడ్డం మంచిది!" అన్నాడు లాల్.

లత నవ్వుతూ అతనికేసి చూసింది.

"లాల్, మనకొక చిన్న కేస్ దొరికింది. ఆమె అయిదు వందలు అడ్వాన్సు ఇచ్చి వెళ్ళింది. పని పూర్తికాగానే ......"

"యూ డర్టీ లయ్యర్, పక్క గదిలో కూర్చొని మీ సంభాషణంతా విన్నాను. నీకు ఆమె ఆరువేలు ఇచ్చింది!"

"అంతా విన్నావుగా! అదీ మంచిదే. స్టార్ట్ ఎట్ ఒన్స్! మూడురోజుల్లో నీ రిపోర్టు నా చేతుల్లో వుండాలి!' అందామె.

"ముప్ఫయిరోజుల తర్వాత ఆమెకు రిపోర్టు పంపి నెల పనిచేశామని అబద్ధమాడావు! యూ మనీ ఈటింగ్ కంబూస్!" అన్నాడతను.

"లాల్ స్వీట్ బాయ్, బయల్దేరు!" అందామె బతిమాలుతూ.

"మూడువేలు ఇలా పడేయి!"

"ఎందుకు?"

"ఖర్చులకు!"

"పట్నంలో తిరగడానికి పల్లవా ట్రాన్స్‌పోర్టు వుంది. బెస్ట్ మీన్స్ ఆఫ్ ట్రావెల్!" అని ఆమె ఒక వందరూపాయిల నోటును అతనికిచ్చింది.

"లాల్, ఖర్చయిన ప్రతి పైసాకీ నాకు అకౌంట్ కావాలి!" అర్చిందామె అధికార ధోరణిలో.

"మూడువేలిస్తేగాని నేను పరిశోధన ప్రారంభించను" అన్నాడతను.

ఆఖర్కి ఏడుస్తూ ఆమె లాల్‌కి అయిదుకందలిచ్చింది. తులసి రాసిచ్చిన అడ్రెస్‌ను చూసి విజిల్ వేస్తూ లాల్ బయటకు కదిలాడు.

5

ఆకాశంలో చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. ప్రొఫెసర్ రాజారావు ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ఇద్దరూ ఎవ్వరూలేని ప్రదేశానికి వెళ్ళి కూర్చున్నారు.

సముద్రపు హోరు వినిపిస్తోంది. ఎడంవైపు ఎత్తయిన సరుగుడు చెట్లు వున్నాయి.

"ఇక్కడ హాయిగా వుంది. ఏంకావాలన్నా చేసుకో వచ్చు," అన్నాడతను.

ఆమె నలువైపులా చూసింది. కొంచెం దూరంగా కూర్చొని ఎవరో సిగరెట్ కాలుస్తున్నారు.

"రాజా, ఇక్కడ వున్నది మనిద్దరమే కాదు!" అందామె.

ఆమె చూపించినవైపు అతను చూశాడు. ఒక ఆకారం అతనికి కనిపించింది.

"పాయసంలో చీమలా వాడెందుకిక్కడా?" అన్నాడు ప్రొఫెసర్ రాజారావు.

"ఇంకా దూరంగా పోదాం," అంది జయ.

ఇద్దరూ ఇంకా దూరంగా వెళ్ళారు. కాస్సేపట్లో ఆకారం వాళ్ళకు దగ్గరగా కదిలింది.

జయ అతడిని కౌగలించుకుంది.

"రాజా, ఎవరో మనల్ని వెంటాడుతున్నారు!" అందామె.

"సిల్లీ! మన్నెవరు వెంటాడుతారు?"

"రాజా, నువ్వు ప్రొఫెసర్ కావచ్చు కాని అమాయకుడవు. మన ప్రేమను లోకం చూడలేదు. నీ భార్య, మా నాన్న! మనమీదకు రాళ్ళు విసిరేవాళ్ళు చాలామంది వున్నారు," అందామె.

"జయా, నిన్ను విడిచి నేను బ్రతకలేను. నీ తండ్రి అడ్డొస్తే యెలాగ?" అడిగాడతను.

"ప్రేమకోసం అడ్డుగోడల్ను కూలగొట్టాలి! అది చెయ్యలేని పక్షంలో రోమియో, జూలియెట్లలా మనం బలైపోవాలి," అందామె.

చంద్రకాంతిలో జయ కళ్ళు తళతళ మెరుస్తున్నాయి. రాజారావు ఆమెను ఆప్యాయంగా ముద్దెట్టుకున్నాడు.

"జయా, నిన్ను ఈ జీవితంలో నేను వదలను. నీకోసం ఏమి చెయ్యడానికేనా నేను సిద్ధం," అన్నాడతను.

"నన్ను నీవు పెళ్ళాడ్తానంటే నాన్న అడ్డురాడు!" అంది జయ.

"నా భార్య వుందని మర్చిపోతున్నావు!" అన్నాడతను.

"ఆమె ఒప్పుకుంటే నువ్వు నన్ను పెళ్ళాడొచ్చుగా!" అంది జయ.

"అడిగి చూస్తాను," అన్నాడతను.

మరో యువతిని తను పెళ్ళాడ్తానంటే తులసి ఒప్పుకోదని అతనికి తెలుసు. తులసి దృష్టిలో పెళ్ళి ఒక పవిత్రమైన బంధం. అటువంటి స్త్రీని లొంగదీయడం సాధ్యంకాకపోవచ్చు.

కొంచెం దూరంలో కూర్చున్న లాల్ వాళ్ళు చేసినదంతా స్పెషల్ కళ్ళద్దాలతో స్పష్టంగా చూడగల్గుతున్నాడు.

'ఆ యువతికోసం అతను ఏదేనా చేస్తాడు! హీ ఈజ్ మాడ్ ఫర్ హర్!' అనుకున్నాడు లాల్ తనలో తను.

6

బెంగుళూర్ !

ప్రొఫెసర్ రాజారావు మంచి నిషాలో వున్నాడు. పీటర్ స్కాట్ బాటిల్ టీపాయిమీదుంది. టీపాయి పక్కన చల్లటి సోడాబుడ్లు వున్నాయి.

అప్పుడే బాత్‌రూమ్‌లోంచి బయటకొస్తూన్న జయ వైపు అతను చూశాడు. ఆమె శరీరం బంగారం పూసినట్లు మెరుస్తూంది.

ఆమె బ్లూ టర్కిష్ టవల్ చుట్టుకుంది. ఆ స్థితిలో ఆమెను చూస్తూంటే నెలల తరబడి అతడిలో అవకాశం చిక్కక అణగి వున్న కోర్కె రగుల్కొని భోగిమంటలా మండింది.

జయ అద్దం ముందు నిలబడింది. తూలుతూ అతను ఆమె వెనక్కి జరిగాడు. అతని చేతులు ఆమెను చుట్టేశాయి. ఆమె ధరించిన తువ్వాలు వూడి కిందకు జారింది.

పక్క గదిలోని వెంటిలేటర్‌లోంచి లాల్ వాళ్ళ వైపు చూస్తున్నాడు. అతను నవ్వుకుంటూ వెనక్కి తిరిగి కుర్చీ మీద నుంచి టేబుల్ మీదకు దిగి కిందకు దూకాడు.

టెలిఫోన్ మ్రోగింది. లాల్ గ్లాసులోని బ్రాందీని కొంచెం త్రాగి రిసీవ రెత్తాడు.

"హలో లాల్ స్పీకింగ్!" అన్నాడతను.

"లాల్, ఏం చేస్తున్నావు?" అర్చింది లత అటువైపు నుంచి.

"పక్క గదిలో వాళ్ళేం చేస్తున్నారో చూస్తున్నాను" అన్నాడు లాల్.

"ఏం చేస్తున్నారు వాళ్ళు?"

"వాళ్ళు చేస్తున్నవి నీలాంటి పెళ్ళికాని మిస్సమ్మలు వినకూడదు."

"యూ డర్టీ మనీ వేస్టింగ్ రోగ్, ఏం చూశావో చెప్పు!"

"పక్క గదిలో నున్న జయ మహా అందంగా వుంది. ఆమె ఒంటిమీద టర్కిష్ టవల్ మాత్రం వుంది. అది కూడా మెల్లగా కిందకు జారింది."

"లాల్, డోంట్ ఫాల్ ఫర్ హర్! పనిని ముగించి తొందరగా రా!" అరిచిందామె.

"నాకు రెండు వేలు కావాలి!" అన్నాడతను.

"ఎందుకు? పట్టుకెళ్ళిన అయిదు వందలు చాలు!"

"లతా, బయట వూళ్లో పని చేస్తే రోజుకి వెయ్యి రూపాయిలు మనకొస్తుందిగా! రెండు వేలు వెంటనే బాంకి ట్రాన్స్‌ఫర్ చేయించు నా పేర!" అన్నాడు లాల్.

ఆమె దగ్గడం మొదలెట్టింది.

"గుడ్ గాడ్! నువ్వు దగ్గితే ఇంత దూరంలో వున్న నా మీద చినుకులు పడుతున్నాయి. నా మాట విను. గో అండ్ సీ డాక్టర్ ఫాక్స్. నిర్లక్ష్యం చేస్తే తర్వాత అది టి. బి. అయితే మనం కంపెనీ మూసెయ్యాలి."

"నేను లేకపోతే కంపెనీ మూసేయాలన్నందుకు సంతోషిస్తున్నాను. నిజం ఇప్పటికేనా తెల్సుకున్నావు," అందామె.

"యూ ఫూల్, నా అర్థం అది కాదు. నువ్వు టి.బి.తో దగ్గుతూ కూర్చుంటే క్లయింట్స్ ఆఫీసుకు రారు. మరె

క్కడికో పోతారు. అందువలన మనం మూసేయాలని నా అర్థం."

"యూ రాస్కెల్! నాకు ఏదో రోగం వుందని కలలు కంటూ కూర్చోకు! మళ్ళీ చెప్తున్నా. తక్కువ ఖర్చుతో ఎక్కువ సాధించి బృందావన్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చేయి."

"రెండు వేలు..." అన్నాడతను.

"యూ డర్టీ రాట్!" అని ఆమె రిసీవర్ని పెట్టేసింది.

లాల్ రిసీవర్ పెట్టేసి గ్లాసులోని బ్రాందీని తాగేశాడు. సిగరెట్ పీలుస్తూ టేబుల్ ముందున్న కుర్చీ ఎక్కి వెంటిలేటర్‌లోంచి పక్క గదిలోకి చూశాడు.

గదిలో ఎవ్వరూ లేరు. టీపాయ్ మీద బాటిలుంది. వాళ్ళు ఎక్కడికి పోయారు? దూరంలో వున్న బాత్ రూమ్ తలుపు కొద్దిగా తెరిచి వుంది. వాళ్ళు బాత్ రూమ్‌లో వున్నారేమో!

నగ్నంగా బాత్‌రూమ్‌లోంచి గదిలోకొస్తున్న జయ అప్రయత్నంగా ఎదురుగా వున్న వెంటిలేటర్ వైపు చూసి త్రుళ్ళిపడింది. లాల్ వెనక్కి తిరిగి క్షణంలో కిందికి దూకాడు. టేబుల్ మీదున్న కుర్చీని లాగి నేల మీద పెట్టాడు. ఆమె తనను చూసింది! ఆలోచిస్తూ లాల్ సోఫాలో కూర్చుని బ్రాందీ తాగుతూ వుండిపోయాడు.

7

ప్రొఫెసర్ రాజారావు తలుపు మీద తట్టాడు. ఎవరూ తలుపు తెరవలేదు. ఇంకా గట్టిగా తట్టాడు. తలుపు తెరిచి లాల్ మందహాసంతో రాజారావుకేసి చూశాడు.

"మై డియర్! లూసీ-ఫర్ డియర్!" తడబడుతూ లాల్ వాగుతున్నాడు.

రాజారావు లోపలకు కోపంగా జొరబడ్డాడు. టీపాయి మీదున్న బ్రాందీబాటిల్ వైపు చూశాడు. లాల్ తూలుతున్నాడు. అర్థంలేని మాటలు వెలువడుతున్నాయి అతని గొంతులోంచి. తప్ప తాగుండాలి అనుకున్నాడు రాజారావు.

"మిస్టర్! నువ్వు ఇంతవరకూ ఏం చేస్తున్నావు?" అడిగాడు ప్రొఫెసర్.

"ఐ డ్రింక్! వుయ్ డ్రింక్! దే డ్రింక్!" అని లాల్ పొట్టమీద చెయ్యేసి నవ్వాడు.

"ఇటువైన పిచ్చి పనులు చేస్తే పోలీసులకు అప్పగిస్తాను!" బెదిరించాడు ప్రొఫెసర్.

"డ్రింకు పిచ్చికాదు! నో! మై డియర్, కమ్ అండ్ జాయిన్ మీ," అన్నాడు లాల్.

లాల్ గదిలో తూలుతూ ఈలపాట పాడుతున్నాడు, పిచ్చి చేష్టలు చేస్తున్నాడు.

ప్రొఫెసర్ రాజారావు లాల్‌ని భుజం మీద తట్టాడు.

"నీ పేరేమిటి?"

"దేవ్-దాస్!" అని లాల్ బ్రాందీ బాటిల్‌ను అందుకున్నాడు.

"ప్రేమించి ఫెయిలయ్యావా?"

"పార్వతి ఐ లవ్. పార్వతి మేరీ...ఓల్డ్ రాట్!" అన్నాడు లాల్.

ప్రొఫెసర్ రాజారావు గదిలోంచి బయటకు వచ్చి తలుపు దగ్గరగా మూశాడు. పక్కనున్న గదిలోకి వెళ్ళాడు.

సోఫాలో వున్న జయ పక్కనే చతికిల బడ్డాడు. "జయా, అతను ఏమీ చూడలేదు. చూసినా ఏదీ జ్ఞాపకముండే స్థితిలో అతను లేడు," అన్నాడతను.

"అతను చక్కగా చూశాడు డర్టీ ఫెలో!" అందామె.

"అతను తప్ప తాగి వున్నాడు. అతని పేరు దేవదాస్ట. ఏ పార్వతో అతడికి పిచ్చెక్కించి వదిలేసింది. పూర్ చాప్ బాటిల్ కి మెల్లిగా బలైపోతున్నాడు."

"అతను నటించడం లేదుగా?"

"ఎందుకు నటిస్తాడు? నన్ను నమ్మకపోతే అతని గదిలోకి తీసుకుళ్తాను రా! అతడిని చూసి నీ హృదయం కరిగిపోతుంది!"

"ఆల్ రైట్, అతడిని మర్చిపోదాం," అందామె.

"జయా! అనుక్షణం నువ్వు నా కళ్ళ ముందు వుండాలి," అన్నాడతను.

"అదే నా కోరిక కూడా!" అందామె.

"తులసిని అడిగాను. ఆమె మన పెళ్ళికి ఒప్పుకోనంది" అబద్ధమాడేడతను.

జయ అతని వైపు తీక్షణంగా చూసింది.

"రాజా, నిన్న మనం చూసిన జలపాతంలో పడిపోదాం! చెయ్యీ చెయ్యీ కలిపి రాళ్ళమ్మట కిందకి దొర్లిపోదాం! ఈ జన్మలో సాధ్యం కానిది వచ్చే జన్మలో దొరుకుతుందేమో!" అందామె.

ఆమె కళ్ళమ్మట నీళ్లు కారుతున్నాయి. ఆమె కన్నీళ్లు చూసి అతను ఏడుస్తూ ఆమెను కౌగలించుకున్నాడు.

"జయా, అడ్డొచ్చే నా భార్యను తొలగిస్తాను!" అన్నాడతను.

"ఎలా రాజా? డైవర్స్ చేస్తావా?"

ఆమె అతని వైపే చూస్తోంది. రాజారావు మొహం అదో విధంగా మారింది.

"నేను చదువుకున్నవాడిని. సంస్కారం గలవాడిని! అయినా మన ప్రేమ కోసం ధైర్యంగా ఆమెను హత మార్చాలి!"

"నువ్వూ నేనూ ఇరుక్కుంటాం!" అందామె.

"రోజూ ఆలోచిస్తున్నాను, అతి రహస్యంగా ఆమెను తుద ముట్టించాలి! అటుపైన నీకూ నాకూ స్వేచ్ఛ! మనం హాయిగా జీవించవచ్చు!" అన్నాడతను.

"రాజా, నాకు భయంగా వుంది!" అందామె.

"ప్రేమ ధైర్యాన్ని ఇస్తుంది," అన్నాడతను.

జయ అతని చెయ్యి పట్టుకుంది. అతనిని ఆప్యాయంగా తన మీదకు లాక్కుంది.

8

లత అండ్ లాల్ కంపెనీ పంపిన సీక్రెట్ రిపోర్టును తులసి మూడుసార్లు చదివింది. టైపు కాయితాలను మడిచి కవర్లో పెట్టి, కవర్ను తన పరుపు కింద దాచుకుంది.

ఈ మధ్య రాజారావు తన పడగ్గదిలోకి రావడంలేదు, ప్రక్కనున్న మరో పడగ్గదిలో అతను ఒంటరిగా పడు కుంటున్నాడు.

ఆమె లేచి గుమ్మం దగ్గరగా వెళ్ళి తలుపు మూసి లోపల గడియ బిగించింది. మెల్లిగా వెళ్ళి పరుపు మీద వాలింది. రిపోర్టులో వాళ్ళిచ్చిన వార్నింగ్ ఆమె చెవుల్లో మ్రోగుతోంది.

"మీ భర్త మిమ్మల్ని చంపడానికి ప్రయత్నాలు చేయొచ్చు. మీరు మెలుకువగా వుండాలి. మీకు ప్రమాదం రాకుండా మేం చూడగలం. అది మీకు అవసరమైతే వెంటనే మమ్మల్ని కల్సుకోండి" అని వాళ్ళు రాశారు.

తులసి ముఖాన్ని తలగడలో దాచుకుని వెక్కి వెక్కి

ఏడుస్తోంది. తన తలిదండ్రులు పోయారు. దగ్గర చుట్టా లెవ్వరూ లేరు.

పెళ్ళయిన పదేళ్ళ తర్వాత తన సంసారం రాళ్ళకు కొట్టుకుని ఇలా ముక్కలవుతుందని కలలో కూడా ఆమె వూహించలేదు. తనకు అన్యాయంచేసి భర్త సుఖపడలేదు.

9

టైమ్ తొమ్మిది దాటింది.

ప్రొఫెసర్ రాజారావు వంటగది బయట నిలబడ్డాడు. వంటామె మీనాక్షి అతనివేపు భయంతో చూసింది. తన వంటకాలు బాగాలేవని చెప్పడానికి వచ్చాడేమో అతను అనుకుంది!

"తులసి పాలు నాకిచ్చి మీరు వెళ్ళొచ్చు!" అన్నాడు రాజారావు.

మీనాక్షి పాలగ్లాసును అతని కందించి బయటకు వెళ్ళి పోయింది. అతను వీధితలుపు మూసి, కింది లైట్లు తీసేసి మెట్లమ్మట పైకి వెళ్ళాడు.

పాలగ్లాసును తనగదిలోకి పట్టుకెళ్ళి టీ పాయిమీద పెట్టాడు. బీరువాలో తను దాచిన చిన్న బుడ్డీని తీశాడు. దానిపైన ఎర్రటి అక్షరాల్లో "పాయిజన్" అని లేబు లుంది. బుడ్డీలోని ద్రవాన్ని అతను పాలల్లో పోసి, చంచాతో కలుపుతూ కూర్చున్నాడు.

అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది. ముఖంమీద చమట పోసింది. చంచాను పట్టుకున్న చేయి కొద్దిగా వణుకుతోంది. అతను ఆలోచిస్తున్నాడు. తన జీవితానికి అడ్డయిన ఒకవ్యక్తిని చంపడానికి తనింత భయపడు తున్నాడు! జర్మనీలో ఒక స్త్రీ వందలాది యువకుల్ని చంపింది. ఆమె కథ క్రితం రాత్రే చదివాడతను. ఆమె కంత ధైర్యం ఎలా వచ్చిందో!

పాలల్లో తను పోసిన ద్రవం బాగా కలిసిపోయింది. ఏదో కలిపినట్లు ఎవ్వరూ గుర్తించలేరు! కాని పాల రుచి మారుతుందేమో!

అతను పడివైపున్న గుమ్మంకేసి చూశాడు. భార్య గదికి ఆ గుమ్మంలోంచి వెళ్ళాలి. అతను లేచాడు. గ్లాసు పట్టుకొని గుమ్మంవద్దకెళ్ళి తలుపు తోశాడు. తలుపు గడి పెట్టబడిందేమో, ఎంత తోసినా తెరుచుకోలేదు.

బయట నడవమ్మట అతను తులసి గదికి వెళ్ళాడు. తలుపు తోయగానే తెరుచుకుంది. అతను మెల్లిగా పరుపు దగ్గరకు నడిచాడు. పాలగ్లాసును ఆమె పక్కనున్న టీపాయిమీద పెట్టాడు.

గొంతుదాకా దుప్పటి కప్పుకుని తులసి నిద్రపోతోంది. అదీ మంచిదే అనుకున్నాడతను. ఎప్పుడో లేచి పాలు తాగుతుంది. ఆమె లేచి తాగకపోతే! ఆమెను లేపి పాలు తెచ్చానని చెప్పాలి! మెల్లిగా ఆమెను తట్టాడు. ఆమె తొందరగా పాలు తాగాలి? అతని గుండె నూటనాలుగు డిగ్రీలు టెంపరేచర్ వచ్చినట్లు వేగంగా కొట్టుకుంటోంది.

తులసి లేచి కళ్ళు తెరిచి అతనివైపు చూసింది.

"మీరా!" అందామె.

"తులసీ, నీ కోసం పాలు తెచ్చాను. తాగి పడుకో! లేకపోతే నిద్రలో మర్చిపోతావు," అన్నాడతను.

"మీరెందుకు తెచ్చారు? మీనాక్షి ఏమైంది?"

"ఆమె కాలు బెణికింది. పైకి రాలేనంది!" అబద్ధమాడా డతను.

తను ఏం చెప్పినా ఫరవాలేదు. పాలు తాగగానే ఆమె మరోలోకంలో వుంటుంది. మీనాక్షిని అడిగే అవకాశం ఆమెకుండదు.

"చాలా థాంక్స్, ప్రేమతో పాలు తెచ్చి నా కిచ్చి నందుకు," అందామె.

ఆమె గ్లాసును అందుకుంది.

"నే వెళ్తాను. నోట్సు రాయాలి," అని పిరికిపందలా అతను తన గదిలోకి పరుగెత్తాడు.

నీళ్లు తరిగిపోతున్న చెరువులో చేపలు ఎగిరినట్లు అతని మెదడ్లో అనేక ఆలోచనలు తలెత్తుతున్నాయి. తన గదిలో అతను పచార్లు చేస్తున్నాడు. ఆమె అరుస్తుందేమో!

ఈ విషం తాగినవాళ్ళు అరవలేరు. తాగడం, పోవడం వెనువెంటనే సంభవిస్తాయని అతనికి తెలుసు. భార్య గదికీ, తన గదికీ మధ్యనున్న గుమ్మందగ్గర అతను నిలబడ్డాడు. తలుపుకు చెవి ఆనించి అటువైపు గదిలోని శబ్దాలను వినసాగాడు.

అటువైపు గదిలో ఏ చప్పుడూ లేదు! ఈ పాటికి ఆమె పాలు తాగేసి, పరుపుమీద వెనక్కి పడివుండాలి!

టెలిఫోన్ మ్రోగింది. అతను పరుగెత్తుకెళ్ళి రిసీవర్ని అందుకున్నాడు.

"హలో!" అన్నాడతను.

"రాజా, నువ్వేనా?" అడిగింది జయ.

"నేనే!"

"హోటల్ ఫోన్ లోంచి మాట్లాడుతున్నాను. ఏమైంది?" అడిగిందామె.

ఆమె కంఠం విన్నాక అతనికి ధైర్యమొచ్చింది. "అంతా అయిపోయింది. పాలు నేనే ఇచ్చాను. తాగేసి పడుకుని వుంటుంది. మెలుకువలేని నిద్ర!" అన్నాడతను.

"వెళ్ళి చూశావా?"

"చూడాలి!"

"అవసరమైతే నే నొస్తాను."

"జయా, నువ్వు రావద్దు. అంతా సవ్యంగా సాగిపోతుంది," అన్నాడతను.

"అయితే రేపటినుంచి వుయ్యార్ ఫ్రీ!" అందామె.

"రేపటిదాకా ఎందుకు, యీ క్షణంనుంచీ మనం స్వేచ్ఛగా గాలి పీల్చొచ్చు," అన్నాడతను.

"తారుమారవదుగా?"

"నో ఛాన్స్!" అన్నాడతను.

"రాజా, గుడ్ నైట్!" అని ఆమె రిసీవర్ని పెట్టేసింది.

అతను రిసీవర్ పెట్టేసి సిగరెట్ వెలిగించాడు. టైమ్ చూశాడు. పదైంది. గుమ్మం దాటి అతను నడవలో అడుగుపెట్టాడు. కాలికేదో మెత్తగా తగిలింది. అది ఏమిటో చూడకుండా అతను గబగబా భార్య గదిలో ప్రవేశించాడు.

క్షణకాలం ఆగి పరుపుకేసి చూశాడు. ఆమె పడుకుని వుంది. వేగంగా దగ్గరకెళ్ళాడతను. గ్లాసులో కొద్దిగా పాలున్నాయి. ఆమె నిద్రపోతున్నట్లు వుంది. అది నిద్ర కాదు, చావు!

ఆమె శరీరాన్ని ముట్టుకున్నాడతను. గుండెమీద చెయ్యివేసి చూశాడు. మామూలుగా కొట్టుకుంటోంది. గుడ్ గాడ్, ఇదెలా సాధ్యం? అన్ని పాలు తాగి ఆమె ఇంకా ఎలా బతికుంది?

తలా తోకా తెలియడంలేదు. అతను తన గదివైపు నడుస్తున్నాడు. నడవలోని స్విచ్ నొక్కి తన కాలికి మెత్తగా తగిలినదేమిటా అని చూశాడు.

నల్లటి పిల్లి! గచ్చునేలమీద చచ్చిపడుంది! కాల్తో

అతను పిల్లిని దూరంగా తన్నాడు.

ఏదో ఆలోచన తట్టి పిల్లిపడున్న చోటకు పరుగెత్తాడు. నల్లపిల్లి ఎలా చచ్చింది? గ్లాసులోని పాలను పిల్లి తాగేసిందా? గ్లాసు కిందపడిన చప్పుడు ఎందుకు కాలేదు?

అంతా అగమ్యగోచరంగా వుంది. తను ఊహించిన విధంగా అంతా జరగలేదు.

అతను మళ్ళా భార్యగదిలోకి వెళ్ళాడు. టీపాయి మీదున్న గ్లాసును నీళ్ళుపోసి కడిగేశాడు. నడవలోకొచ్చి చచ్చిపడున్న పిల్లిని బాల్కనీపైనుంచి తోటలోకి విసిరాడు. తన గదిలోకి చేరుకున్నాడు.

టైమ్ చూశాడు. పదకొండైంది. తులసి చావలేదు. ఆమె పాలు తాగలేదు. ఆమె ఎక్కడో పోసిన పాలను పిల్లి తాగివుండాలి! ఆమె పాలను ఎందుకు పారబోసింది? తను ఆమెను చంపడానికి ప్రయత్నిస్తున్నట్లు అమెకు తెలిసుండాలి!

ఇప్పుడేం చెయ్యాలి? పొద్దుటే ఆమె లేచి పాలను గురించి అతడిని అడుగుతుందేమో? పిల్లిని తోటలో పడేసినందుకు అతను సంతోషించాడు. చనిపోయిన పిల్లిని తులసి చూసుండదు! అనేకవిధాల అతను ఆలోచిస్తూ సిగరెట్ తర్వాత సిగరెట్ కాల్చి యాష్ట్రేలో కుక్కుతున్నాడు.

10

వెలుతురు వచ్చేముందే తులసి మేల్కొంది. టీపాయి మీదున్న గ్లాసువైపు చూసింది. అడుగున పాలు లేవు. అతను గ్లాసును కడిగివుంటాడని ఆమె గ్రహించింది.

ఒక ఆడదాన్ని తుదముట్టించడానికి అతను ఎంత తాపత్రయపడ్తున్నాడో! ఆమె కిందకి దిగి నడవలో

కెళ్ళింది. అతని గదిముందు నల్లటి పిల్లి పడుండాలి! క్రితం రాత్రి పడున్న పిల్లిని ఆమె చూసింది. కాని ఇప్పుడు పిల్లి లేదు? ఏమైంది? దాన్ని ఎక్కడో పారేసివుండాలతను.

తులసి అతని గదిలోకి వెళ్ళింది. గదిలో లైటు వెల్గు తోంది. యాష్ట్రే నిండా సిగరెట్ పీకలున్నాయి. రాజారావు వుండచుట్టుకుని సోఫాలో పడుకునివున్నాడు. ఆమె మెట్లు దిగి కిందకెళ్ళింది. వీధి తలుపు తెర్చింది.

తోటంలోకి ఆమె కదిలింది. అప్పుడే వెల్తురొస్తోంది. ఇంటికొస్తూన్న వంటామె ఆమె కెదురైంది. తులసిని చూసి వంటామె నవ్వింది.

"మీ కాలు బెణికిందా?" అడిగింది తులసి.

"లేదమ్మా! అలా ఎవరు చెప్పారు?"

"మీరు పాలు తేకపోతే మునపటిలా బెణికిందనుకున్నాను," అంది తులసి.

"పాలు అయ్యగారు తీసుకెళ్తానన్నారు. నన్ను వెళ్ళి పొమ్మన్నారు."

తులసి విని ముందుకు సాగిపోయింది. వంటామె ఇంట్లోకి వెళ్ళిపోయింది. మొక్కల పక్కన పడున్న పిల్లి వెపు ఆమె చూస్తూ నిలబడింది. తోటవాడు ఆమెముందు ప్రత్యక్షమయ్యాడు.

"సుబ్బా, యీ పిల్లిని దహనం చేయి!" అందామె.

తన భర్త హృదయంలోని కల్మషాన్ని, కృత్రిమాన్ని తనకు చాటుతూ పిల్లి మరణించింది. అటువంటి జంతువును దహనంచేసి తన ఋణాన్ని తీర్చుకోవాలి!

"అలాగే నమ్మా!" అన్నాడతను.

పిల్లి మీద పుల్లలూ, ఎండుటాకులూ పడేసి అగ్గిపుల్లతో అంటించాడతను. మంటలు పైకిలేచాయి. ఆమె కాల్తూన్న

చితిముందు కాస్సేపు నిలబడింది. భార్యగా తన ఆశలన్నీ ఆ మంటల్లో భగ్గుమంటున్నట్లు అనిపించిందామెకు!

ఆమె వెనక్కి తిరిగి ఇంట్లోకి వెళ్ళింది. అంతా తెలిసినా దేన్నీ ఆపాలనే వుద్దేశం ఆమెకు లేదు. అగ్గి రగిలించినవాళ్ళు మంటల్లో మాడిపోయి తీర్తారు!

11

సముద్రపొడ్డున ఇద్దరూ కూర్చున్నారు. ఇంకా చీకటి పడలేదు.

ప్రొఫెసర్ రాజారావు ముఖం పేలవంగా వుంది. ఎర్రబడిన అతని కళ్లు చూస్తే రాత్రి అతను సరిగ్గా పడుకోలేదని తెలుస్తోంది.

"రాజా, ఏమిటలా వున్నావు?" అడిగింది జయ.

"నేను చంపడానికి ప్రయత్నించానని తులసికి తెలుసు."

"ఎందుకలా అనుకుంటున్నావు?"

"నేనిచ్చిన పాలు ఆమె తాగలేదు. ఏ బాత్ రూమ్ లోనో పోసుంటుంది. నేలమీద పోసిన పాలను నాకిన పిల్లి మరణించింది. నేను గదిలోకి వెళ్ళినపుడు ఆమె నిద్ర పోతున్నట్లు నటించింది. జయా, ఆమెకంతా తెలుసు! ఆమె పోలీసు రిపోర్టిస్తుందేమో!" అన్నాడతను గాభరాగా.

జయ మాట్లాడలేదు. అతని చెయ్యి పట్టుకుంది.

"జయా, ఇంతవరకూ వచ్చాక వూరుకుంటే లాభం లేదు. తెగించి ఆమెను అడుగట్టించాలి!" అన్నాడతను.

"ఏం చెయ్యదల్చుకొన్నావు?"

జయ చేతులు అతడిని చుట్టేశాయి.

"జయా, నిద్రలో వున్నపుడు గొంతు పిసికేయాలి!

ఆమె ప్రతిఘటిస్తే మనిద్దర్నీ రచ్చకెక్కిస్తుంది!"

అతను తన చేతులను చూసుకున్నాడు. సున్నితమైన చేతులు. కలంతో రాయడానికి అలవాటుపడిన చెయ్యి ఇప్పుడు తాడై ఆమె గొంతును నులపాలి! అదంతా తను చెయ్యగలడా?

ఆమె అతనితో పోట్లాడొచ్చు. గట్టిగా అరిస్తే పక్క ళ్ళలో వుండేవాళ్ళెవరేనా రావచ్చు!

ఇన్నేళ్ళపాటు విద్యావంతుడిగా, పెద్దమనిషిగా జీవించిన తను పుర్రుల పాలై మురుకాల్వలో తల దాచుకోవాలి!

జయ అతనివైపు కళ్ళు చిట్లించి చూసింది. "రాజా, మన ప్రేమసౌధాన్ని నిలబెట్టుకునేందుకు మరో ప్రాణాన్ని తుంపివేయడం అన్యాయమనిపిస్తోంది. మన ప్రేమను ఇంకా పెంచుకుంటే ప్రమాదం. ఇప్పుడే విడిపోదాం, రాజా! ఈ జన్మలో అడవిలోని పువ్వులా వాడిపోయినా వచ్చే జన్మలో సంపూర్ణంగా నీదాన్నవుతాను, రాజా!" అంది ఆమె.

ప్రొఫెసర్ రాజారావు సముద్రంవైపు చూస్తూ వుండిపోయాడు. బలమైన కెరటం ముందుకొచ్చింది. సముద్ర తీరాన ఆడుకుంటూన్న ఆరేళ్ళ కుర్రాడిని భయంకరంగా కొట్టి, అతడిని తనతో సముద్రగర్భంలోకి లాక్కుపోతోంది.

ఆ కుర్రాడు అరుస్తున్నాడు. ఒడ్డునున్నవాళ్ళు అతనివైపు చూస్తూ అరుస్తున్నారు కాని, అతడిని కాపాడే ధైర్యం ఎవ్వరికీ లేదు.

మరో కెరటం కుర్రాడ్ని ఒడ్డుకు తోసుకొచ్చి పడేసింది. అందరూ అతనివైపు పరుగెత్తారు. పొట్టవుబ్బిన

కుర్రాడివైపు ప్రొఫెసర్ రాజారావు తదేకంగా చూశాడు.

ఒక నిండు ప్రాణాన్ని క్షణంలో ప్రకృతి తన కళ్ళ ముందు ధ్వంసం చేసింది! క్షణంలో సంభవించే చావును గురించి తామంతగా ఆలోచించడం వృధా అనిపించింది! అదే జయతో చెప్పాడు.

12

మెట్లపైనుంచి అతను కిందకు చూశాడు. పూజా మందిరంలోంచి తులసి బయటకొచ్చి వంటామెతో మాట్లాడుతూ నిలబడింది.

"మీనాక్షమ్మగారూ, ఇవాళ భోజనం చెయ్యను. ఏకాదశి," అందామె.

"ఫలహారం చెయ్యండి," అంది వంటామె.

"ఇవాళ పూర్తిగా వుపవాసం చేయదల్చాను. మంచి నీళ్ళు తప్ప మరేమీ తీసుకోను," అంది తులసి.

అతను భార్యకేసి సూటిగా చూశాడు. జల్తారున్న ఖరీదైన కంచీపురం పట్టుచీర ఆమె ధరించింది. అదే గుడ్డతో కుట్టిన జాకెట్. ఆమె మెళ్ళో చంద్రహారం మెరుస్తోంది. చేతులకు ఎన్నో గాజులున్నాయి. ఆమెను చూస్తే ధనవంతురాలని తెలుస్తోంది.

తటాలున ఆమె పైకిచూసి భర్తను గుర్తించింది. నవ్వుతూ మెట్లెక్కి వరండాలో వున్న అతని ముందుకు నడిచింది. ఆమె నుదురుమీద పెద్ద కుంకుమ బొట్టుంది. ఆమె కళ్ళు జ్యోతుల్లా మెరుస్తున్నాయి.

అతని ముందు మోకరిల్లి ఆమె అతని పాదాలకు నమస్కరించింది. అతని గుండె గుభేల్మంది.

"ఏమిటిదంతా?" అడిగాడతను.

"ఏకాదశి. ఉపవాసం చేస్తున్నాను. నన్ను దీవిం

చండి.'' అందామె.

ఆమె ప్లేటులో తెచ్చిన అక్షింతల్ను తీసుకుని అత నామె తలమీద జల్లాడు. సంతోషంగా ఆమె లేచింది. ఒక అరటిపండును అతని చేతిలో పెట్టింది.

''ప్రసాదం తినండి! పూజ చేశాను,'' అందామె.

అరటిపండును పట్టుకుని అతను తన గదిలోకి వెళ్ళి పోయాడు. అరటిపండును పరీక్షగా చూశాడు. పండులో ఆమె ఏదేనా పెట్టిందేమో! ఇంతకుముందు అతను పుస్తకాల్లో చదివాడు. బ్లేడుతో అరటిపండును కోయొచ్చు! కోసినట్లు ఎవ్వరూ గుర్తించలేరు!

అతను మెల్లిగా కిటికీ ముందుకు నడిచాడు. భార్య ఇచ్చిన అరటిపండును పూసలమధ్యనుంచి కింద పడేశాడు.

సిగరెట్ వెలిగించి కిందకు చూస్తూ నిలబడ్డాడు. కొన్ని కాకులు పండువైపు ఎగుర్తూవచ్చాయి. పండును పొడుచుకు తినసాగాయి. పూర్తిగా తినేసి కాకులు అరుస్తూ గాలిలో ఎగిరిపోయాయి!

అందులో విషం లేదు! తన గిల్టీ హృదయంతో తులసిని అతను అనుమానించాడు. తనని గురించి ఎంతో తెలిసినా ఆమెకు తనమీద భక్తి తరగలేదు!

13

ఆకాశంలో చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. చల్లటిగాలి వీస్తోంది.

ఎనిమిది గంటలదాకా పూజచేసి తులసి బయటికొచ్చి నేలమీద కూర్చున్న వంటామెవైపు చూసింది.

''మీనాక్షమ్మగారూ, మీ వంటకాలు చాలా బాగుంటాయి. మీ చేతి రుచిని నేను మరవలేను,'' అంది తులసి.

''ఇవాళ తిండేనా తినలేదు!'' అందామె.

"ఎన్నేళ్ళనుంచో తింటున్నాను, ఇవాళ తినకపోతే పోయిందేమిటి?" అని తులసి వీధి గుమ్మం దాటి తోట లోకి వెళ్ళింది.

చల్లటి చంద్రకాంతి నలువైపులా ప్రసరిస్తోంది. ఆమె కాస్సేపు నిలబడి అన్ని వైపులా చూసింది. వెను తిరిగి హాల్లోకొచ్చి మేడ మెట్లు ఎక్కింది.

తన పడగ్గదిలోకి చేరుకుంది. టాయిలెట్ టేబుల్ సొరుగులో వున్న ఒక పాత ఫోటోను ఆమె తీసిచూసింది. విశాలాక్షి! తన బాల్య స్నేహితురాలు.

చిన్నతనంలో ఇద్దరూ కలిసి స్కూలుకి వెళ్ళేవారు. చెట్టుకింద కూర్చొని టిఫిన్ తినేవారు. తన కీనాడు విశాలాక్షి తప్ప లోకంలో ఆత్మీయులు ఎవ్వరూ లేరు.

విశాలాక్షిని గురించి ఆమె ఆలోచిస్తూంది. చిన్నతనంలో జరిగిన ఒక సంఘటన ఆమెకు జ్ఞాపక మొచ్చింది. ఒక క్లాసబ్బాయి తులసి జడను పట్టుకులాగాడు, నడి రోడ్డు మీద! విశాలాక్షి అది కళ్ళతో చూసింది. కాలి జోడు తీసి ఆ అబ్బాయిని ఎడా పెడా కొట్టింది. అతను పుస్తకాల సంచీ వదిలేసి పరుగెత్తాడు! "విశాలా, ఎందుకు చెయ్యి చేసుకున్నావు?" అడిగింది తులసి.

"మనిషి బతకాలంటే తనని పీడించే యీగల్నీ దోమల్నీ తరిమేయడం నేర్చుకోవాలి! మెత్తటాళ్ళని చూస్తే లోకానికి మొత్తాలనిపిస్తుంది," అందామె.

ఫోటోను సొరుగులో పెట్టేసి తులసి పరుపు మీద నీరసంగా వాలింది.

14

చుట్టూ నిశ్శబ్దంగా వుంది. రాజారావు గుండె మాత్రం దడదడ మంటోంది. అతను మెల్లగా తలుపు తోసి ఆమె

గదిలోకి వెళ్ళాడు. తలుపును మూసి గడియ పెట్టి, అడుగులో అడుగేస్తూ ఆమె పరుపు పక్కగా నడిచాడు.

ఆమె నిద్రపోతోంది. నుదుటి మీద కుంకుమ బొట్టు ఎర్రగా మెరుస్తూంది. పట్టు చీరతోనే పడుకుందామె. పసుపుతో పాదాలూ, చేతులూ పచ్చబడినాయి.

పరుపు వారగా అతను కూర్చున్నాడు. సాలి పురుగు కాళ్ళలా అతని వేళ్ళు ఆమె గొంతు మీదకి పాకుతున్నాయి.

వేళ్ళు తగలగానే ఆమె కళ్ళు తెరిచి అతని వైపు చూసింది. మృదువుగా నవ్వింది. క్షణంలో ఆమె నవ్వు మాయమైంది. అతని చేతులు ఆమె గొంతును చుట్టేశాయి.

"దీనికి శిక్ష మీరు అనుభవిస్తారు!" అందామె.

అతను పళ్ళు పట పట కొరికాడు.

"ఎవరు శిక్షిస్తారు? నీ బాబా? అతనీ లోకంలో లేడు" అన్నాడతను.

"నేనే తిరిగొచ్చి నాకసి తీర్చుకుంటాను!" అందామె.

"చచ్చేవాళ్లు అలాగే అంటారు!" అంటూ అతనామె గొంతును బలంగా నొక్కాడు.

ఊపిరాడక ఆమె ఉక్కిరి బిక్కిరైంది. మరుక్షణంలో ఆమె తల గిజగిజ లాడుతూ వెనక్కి ఒరిగిపోయింది.

అతను ఆమెను వదిలేసి పక్కనే నిలబడి చూశాడు. పట్టుచీర పమిట మీది ఒక రక్తం చుక్క ఆమె నోట్లోంచి పడింది!

ఇప్పుడతను భయపడ్డం లేదు. జేబులోని పాకెట్ తీసి సిగరెట్ వెలిగించి పొగ పీలుస్తూ ఆమెకేసి చూశాడు.

అతను కిటికీ వద్దకు నడిచాడు. ప్రక్క ఇంట్లో లైటు

వెలుగుతోంది. అతను తన గదిలోకి మధ్య తలుపు తెరుచుకుని వెళ్ళాడు. గ్లాసులో మూడౌంతులు విస్కీ పోసి సోడా కలిపాడు. గడగడ తాగేశాడు. అలా తాగుతూనే సోఫాలో కూర్చున్నాడు.

టెలిఫోన్ మ్రోగింది. అతను రిసీవర్ని అందుకున్నాడు.

"రాజా!" అందామె.

"అంతా సవ్యంగా జరిగింది. ఓ నిమిషంలో అంతా అయిపోయింది," అన్నాడతను.

"ఈ క్షణంలో నీ మొహం చూడాలని వుంది!" అందామె.

"నువ్వెక్కడున్నావు?"

"లక్ష్మీ మెడికల్ షాపులో, మా ఇంటి పక్క రోడ్డు మీదుంది."

"నేను వస్తున్నాను, రోడ్డుమీద నిలబడి వుండు!"

"అలాగే రాజా!" అని ఆమె రిసీవర్ని పెట్టేసింది.

15

లక్ష్మీ మెడికల్ షాపుకు దూరంగా అతను కార్ను ఆపాడు. గబగబా వెళ్ళి ఆమె కారులో కూర్చుని తలుపు మూసింది.

అతను కారును పోనిస్తున్నాడు.

"ఎక్కడికి పోదాం?" అంది జయ.

"మా ఇంటికి! అదిప్పుడు మనిల్లు!" అన్నాడతను.

"శవం ఇంట్లో వుండగా నేనక్కడికి రావడం శుభ సూచకం కాదేమో!" అంది జయ.

ఒక వ్యక్తి ప్రాణాన్ని బలి తీసుకొన్న అతనిలో కొత్త శక్తేదో వుద్భవించినట్లుంది.

"జయా, ఆ ఇంట్లో నువ్వు అడుగు పెట్టడమే అన్నిటి

కంటె శుభప్రదమైనది! నీ సహాయం నాకు కావాలి. తిండితిని జీర్ణించుకొన్నట్లు చంపినవాడు శవాన్ని రహస్యంగా దాచగల్గాలి!'' అన్నాడతను.

కాసేపట్లో గేటు దాటి కారును అతను లోపలకు పోనిచ్చి ఆపాడు. సమీపంలో వున్న ఇళ్ళలో లైట్లు లేవు. ఇద్దరూ కార్లోంచి దిగారు. ఆమె నడుం చుట్టూ అతను చెయ్యిని పోనిచ్చాడు. తాళం తెరిచి ముందు హాల్లోంచి వాళ్లు పైకి వెళ్ళారు. తులసి గదిలోకి ఇద్దరూ ప్రవేశించారు. మౌనంగా పరుపు పక్కనే నిలబడ్డారు.

తులసి తల తలగడపైనుంచి వెనక్కి వాలి వుంది.

''రాజా, ఆమె నీతో పోట్లాడిందా?'' అడిగింది జయ.

అతను సిగరెట్ పొగ వదుల్తూ నవ్వాడు.

''నన్ను ఏమాత్రం ఎదిరించలేదు. ఆఖరి క్షణంవరకూ నా వేపు చూస్తూ నన్ను గొంతు పిసకనిచ్చింది,'' అన్నాడతను.

పన్నెండు దాటింది.. జయతోసహా అతను తోటలోకి వెళ్ళాడు. చీకటి ప్రదేశంలో ఇద్దరూ ఆగారు. అతను గొయ్యి తవ్వడం ప్రారంభించాడు. గోతులో నిలబడి అతను సిగరెట్ కాలుస్తున్నాడు. అతని తల మాత్రం ఆమెకు అస్పష్టంగా కనిపిస్తూంది.

ఏదో విజిల్ వినబడి ఇద్దరూ మౌనంగా వుండిపోయారు. బీటు కానిస్టేబులు రోడ్డమ్మట కదులుతున్నాడు. అతనెందుకో ఇంటి ముందు ఆగి, గేటుమీద లాఠీతో కొట్టి తన ప్రయాణాన్ని సాగించాడు. అతను బాగా దూరమయ్యాక రాజారావు తన పనిని మళ్ళీ కొనసాగించాడు.

తులసి శవాన్ని మోసుకెళ్ళి అతను గోతిలో పడేశాడు. అతను గబగబా గొయ్యిని మట్టితో పూడ్చేశాడు. గోతి

పైన చదునుగా చేశాడు.

అతని ఒంటినిండా చమట కారుతోంది. చేతుల నిండా మట్టి!

"జయా, వుయ్యార్ రియల్లీ ఫ్రీ!" అన్నాడతను.

జయ అతడిని చేతుల్తో చుట్టేసి, అతని పెదిమలను ముద్దెట్టుకుంది.

16

వారం రోజులపాటు అతను ఇంట్లో లేడు. బెంగుళూర్ మైసూర్ పట్నాల్లో పర్యటించి తిరిగొచ్చాడు.

కార్లోంచి ఒంటరిగా దిగిన అతని వేపు వంటామె మీనాక్షి ఆశ్చర్యంగా చూసింది.

"మీ వుత్తరం అందింది. మీరు వస్తారని తెలుసుకుని ఇక్కడ వేచి వున్నాను. అమ్మగారెక్కడ?" అందామె.

ప్రొఫెసర్ రాజారావు కళ్ళు తుడుచుకున్నాడు.

"మేం వెళ్తుండగా కారుకి యాక్సిడెంట్ అయింది. ఆమె కార్లోంచి కిందపడి మరణించింది. దహన క్రియలు మైసూరులోనే చేశాను," అన్నాడతను.

అతను చెప్పినది తోటమాలి కూడా విన్నాడు. రాజారావు తాళం తెరిచి లోపలకు వెళ్ళాడు. మేడ మీదున్న బాల్కనీలోంచి కిందకి చూస్తూ నిలబడ్డాడు.

"అక్కడ ఎవరో తవ్వి పూడ్చారయ్యా," అన్నాడు తోటమాలి.

"నేనే తవ్వి విత్తనాలు నాటడం మర్చిపోయాను" అన్నాడతను.

కాసేపట్లో చీకటి పడింది. రాజారావు స్నానం చేసి వంటామె పైకి తెచ్చిన కాఫీ సేవించి, సిగరెట్ వెలిగించాడు.

అతను జయ ఫోన్ కాల్ కోసం ఎదురు చూస్తున్నాడు కాని ఎంతకూ ఆమె కాల్ రాలేదు. అర్థాకలిగా అతను తొమ్మిదింటికి భోజనం చేసి వంటామెను పంపేశాడు. కింద తలుపులు మూసి పైకి చేరుకున్నాడు. వాన కురుస్తూంది. ఆకాశాన్ని మెరుపులు చీలుస్తూ ప్రకాశిస్తున్నాయి. వురుములు భయంకరంగా మ్రోగుతున్నాయి.

విసుగ్గా అతను గ్లాసులో విస్కీ పోసుకుని సోడా కలిపి గడగడ తాగేశాడు. వర్షం తగ్గే సూచనల్లేవు. ఇంత వర్షంలో ఆమె తనకు ఫోన్ చెయ్యలేదేమో!

బెంగుళూర్ వెళ్ళే ముందు అతనామెతో అంతా స్పష్టంగా చెప్పాడు.

"జయా, రెండు మూడు నెలలపాటు మనం కలుసుకోవద్దు. అటు పైన మన పెళ్ళి!" అన్నాడతను.

ఎక్కడో పిడుగు పడింది. అతని పడగ్గది కిటికీ తలుపులు టక టక కొట్టుకున్నాయి. అతను మంచి నిషాలో వున్నాడు. డాబా మీదకు వెళ్ళి వర్షంలో వుషారుగా తడుస్తూ నలువైపులా చూశాడు.

ఎవరో నవ్వుతూన్నట్లు వినిపించిందతనికి. అతను వెనక్కి తిరిగాడు. పక్కలకు చూశాడు. ఒక్కళ్ళు కాదు ఎందరో నవ్వుతున్నారు!

ఆకాశాన్ని మళ్ళా మెరుపు చీల్చింది. వెయ్యి రథ చక్రాలు కదులుతూన్నట్లు వురిమింది. గ్లాసులో మళ్ళీ విస్కీ పోసుకుని సోడా కలపకుండా తాగేశాడతను. గొంతును కాల్చుతూ విస్కీ లోపలకు దిగింది!

టెలిఫోన్ మ్రోగింది. జయ. స్వీట్ గర్ల్, ఇంత వర్షంలో కూడా తనకు ఫోన్ చేస్తోంది!

అతను తూలుతూ వెళ్ళి రిసీవర్ని అందుకున్నాడు.

"హలో!" అన్నాడు.

"రాజా, జయని!" అందామె.

"నీ కాల్ కోసం ఎదురుచూస్తున్నాను!"

"రాజా, నీకు బాడ్ న్యూస్ చెప్పాలి!"

"ఏమైంది?"

సమీపంలో పిడుగు పడింది. అతను త్రుళ్ళి పడ్డాడు.

"జయా, టెల్ మీ!"

"నా జీవితం నేను ఊహించని విధంగా మలుపు తిరుగుతోంది, నేను పెళ్ళి చేసుకోబోతున్నాను..."

"ఎవర్ని?"

"శ్రీధర్ ని. అతను ఎమ్మెల్యే పాసయ్యాడు. యువకుడు. ఈడుజోడుగా కుదిరిందని నాన్న అతడితో పెళ్ళి నిశ్చయం చేశాడు."

"జయా! జయా!! అర్చాడతను పిచ్చిగా.

"నువ్వు వయస్సులో నాకంటె చాలా పెద్దవాడవు. ఏదో చిరుగాలిమన్ని కొంత కాలంపాటు దగ్గర చేసి అంత రానమైంది. మనమధ్య రగులు కొన్నది ప్రేమకాదు. గుడ్డిగా మనుష్యుల్లో రేకెత్తే కామవాంఛ! రాజా, గుడ్ బై!"

అటువైపునుంచి క్లిక్ మన్న శబ్దం వినపడింది. ఎన్నో కంఠాలు నలువేపుల నుంచీ నవ్వుతూ వికటాట్టహాసం చేస్తున్నాయి.

అతను పిచ్చివానిలా భార్య గదిలోకి పరుగెత్తాడు. తులసి పరుపుమీద పడుకున్నట్లు అనిపించింది. అతను అరుస్తూ పరుపుమీద పడ్డాడు.

ఏదో సైరన్ వినపడింది. అతను బాల్కనీలోకి వెళ్ళి కిందకు చూశాడు. పోలీస్ వాను కాంపౌండులో ఆగింది.

కానిస్టేబుల్స్ కిందకి దూకారు. వర్షంలో తడుస్తు న్నారు. ఎవరో ఇన్స్పెక్టర్ గబగబా తోటలో అడుగు లేసి ఒక చోట ఆగాడు.

రాజారావు వులిక్కి పడ్డాడు! జయ అంతా వాళ్ళకు చెప్పేసి వుంటుంది.

కాన్స్టేబుల్సు గునపాల్తో తవ్వుతున్నారు. కాసేపట్లో వాళ్లు తులసి శవాన్ని పైకి తీసి నేలమీద పడేశారు.

అతను గదిలోకి పరుగెత్తి విస్కీ బాటిల్ని చేత్తో పట్టుకున్నాడు. గబగబా గ్లాసులో పోసుకొని, పాయిజన్ కలుపుకొని త్రాగేశాడు. ఎవరో వీధి తలుపును తట్టారు. అతను మెట్లుదిగి మెల్లిగా తలుపు తెరిచాడు. ఇన్స్పె క్టర్ నాయర్ లోపలకొచ్చాడు.

"ప్రొఫెసర్ మీ భార్యను హత్య చేసినందుకు మిమ్మల్ని అరస్టు చేస్తున్నాను," అన్నాడు ఇన్స్పెక్టర్.

అతని మనోఫలకం మీద జయ కనిపించింది. తనని కవ్వించి, కృత్రిమమార్గాన చెయ్యి పట్టుకునడిపించి, ఆఖరి క్షణంలో అతనికి స్వస్తి చెప్పిన మోసగత్తె!

ప్రొఫెసర్ రాజారావు సూటిగా ఇన్స్పెక్టర్ వైపు చూశాడు.

"నేనక్కడ శవాన్ని పాతినట్లు మీకెవరు చెప్పారు" అడిగాడతడు.

"మాకు రిపోర్టిచ్చినామె వాన్లోవుంది," అన్నాడు ఇన్స్పెక్టర్.

రాజారావు తూలుతూ బయటకి నడిచాడు. అతని కిరు వైపులా పోలీసులు నిలబడ్డారు. ఇన్స్పెక్టర్ వాన్ దగ్గర కెళ్ళాడు.

రాజారావు వాన్ వైపు చూస్తున్నాడు. అందులోంచి ఒక స్త్రీ పాదాలు బయటకు కనిపించాయి. మరు క్షణంలో ఆమె కిందకి దూకింది. పట్టుచీర, మెళ్లో చంద్ర హారం, నుదురు మీద కుంకుమ బొట్టు.

రాజారావు గుండె పిచ్చిగా కొట్టుకుంది, తులసి! తన భార్య తులసి!!

"తులసీ!" అని అర్చాడతను.

పరుగెత్తుకెళ్లి ఆమెముందు పడ్డాడతను. అది అతని ఆఖరి కేక!

ఇన్స్పెక్టర్ నాయర్ అతనివైపు చూశాడు. అను మానంతో అతడిని ముట్టుకు చూశాడు. ప్రొఫెసర్ రాజా రావు మరణించాడు!

ఇన్స్పెక్టర్ నలువైపులా చూశాడు, వాన్లోంచి దిగిన స్త్రీ కోసం! ఆమె ఏమైంది? వర్షం కురుస్తోంది. ఆకాశంలోంచి మెరుపు తళుక్కుమంది.

ఆ కాంతిలో ఇన్స్పెక్టర్ కళ్ళకు ఆమె ఉల్కలా కనిపించి చటుక్కున మాయమైంది.

ఇన్స్పెక్టర్ నాయర్ మరోసారి తన ముందుపడున్న ప్రొఫెసర్ వైపు చూశాడు. విస్కీ బుడ్డి పక్కనే పగిలి పడుంది. వర్షం చినుకులు అతని శవానికి ఆఖరి స్నానాన్ని చేకూర్చుతున్నాయి!

—: ఐపోయింది :—